వనమహోత్సవం @18.25 లక్షలు



ఖానాపూర్‌లో నర్సరీ పనులు చేస్తున్న కూలీలు

- జడ్చర్ల నియోజకవర్గానికి లక్ష్యం నిర్దేశం
- 200 గ్రామపంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు
- పూర్తికావచ్చిన బ్యాగ్‌ఫిల్లింగ్ పనులు

జడ్చర్ల టౌన్: ఉపాధి హామీ పథకంలో నర్సరీల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో బాలానగర్, రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్, జడ్చర్ల, ఊర్కొండ మండలాలు ఉండగా.. 200 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో ఒక్కో నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది జూన్, జూలైలో ప్రారంభమయ్యే వనమహోత్సవం నాటికి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 200 నర్సరీల్లో 18.25 లక్షల మొక్కలు సిద్ధం చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఈ మేరకు నర్సరీల్లో బ్యాగ్‌ఫిల్లింగ్ పనులు చేపడుతున్నారు. నర్సరీల ఏర్పాటుపై అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తుండగా.. ఈజీఎస్ సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు.

జడ్చర్ల నియోజకవర్గంలో మండలాల వారీగా మొక్కల లక్ష్యం ఇలా..

మండలం	నర్సరీలు	లక్ష్యం
జడ్చర్ల	45	4,80,000
రాజాపూర్	24	1,81,000
మిడ్జిల్	24	2,39,000
బాలానగర్	37	2,50,000
నవాబుపేట	54	5,40,000
ఊర్కొండ	16	1,35,000
మొత్తం	200	18,25,000

చివరిదశకు పనులు..

జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని జీపీల్లో నర్సరీ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. మొత్తం 18.25 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం. అందుకు అనుగుణంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. చిన్నచిన్న సమస్యల కారణంగా ఒకటి, రెండు నర్సరీల్లో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. వాటిని రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తాం.

– శ్రీపాద్, అడిషనల్ డీఆర్డీఓ

ఇవీ సమస్యలు..

కొన్ని గ్రామ పంచాయతీల్లో చిన్నచిన్న సమస్యల కారణంగా నర్సరీల పనులు ప్రారంభం కాలేదు. వాటిలో జడ్చర్ల మండలం మర్రిచెట్టుతండా గ్రామ పంచాయతీలో స్థల సమస్య కారణంగా గొల్లపల్లి నర్సరీలోనే కొనసాగిస్తున్నారు. ఇదే పంచాయతీలో అటవీశాఖ ఆధ్వర్యంలోనూ నర్సరీ నిర్వహించాల్సి ఉండగా.. నేటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. రాజాపూర్ మండలం కొత్రతండాలో నీటి సమస్య కారణంగా పక్కనే ఉన్న చొక్కంపేటలో నర్సరీ నిర్వహిస్తున్నారు. ఊర్కొండ మండలం ఇప్పపహాడ్‌లో నర్సరీకి రోడ్డు సమస్య కారణంగా అక్కడ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు సమస్య పరిష్కరించి, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మిడ్జిల్ పంచాయతీ కార్యదర్శి గ్రూప్–2 పరీక్ష సెలవులో వెళ్లినందున పనులు ప్రారంభం కాలేదు. రెండు, మూడు రోజుల్లో అక్కడ నర్సరీ పనులు ప్రారంభం కానున్నాయి.

సీసీబీ నిర్మాణంపై వీడిన సందిగ్ధం

- నేడు పనులకు భూమిపూజ



జడ్చర్ల ఏరియా ఆస్పత్రి భవనం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణంపై నెలకొన్న సందిగ్ధం వీడింది. ఎట్టకేలకు శుక్రవారం పనులకు శ్రీకారం చుట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత ఏరియా ఆస్పత్రి వద్దే సీసీబీ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ వేణుగోపాల్ గురువారం తెలిపారు. జాతీయ రహదారులపై ప్రమాదాలకు గురయ్యే క్షతగాత్రులకు అత్యవసర సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ సెంటర్‌ను మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ మిషన్‌లో భాగంగా రాష్ట్రానికి మంజూరైన 20 సీసీబీలకు గతేడాది అక్టోబర్ 3న నిజామాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. అయితే దాదాపుగా 14 నెలలు గడిచినా నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. మొదట క్రిటికల్ కేర్ బ్లాక్ ఏరియా ఆస్పత్రి వద్దే నిర్మించాలనే ప్రతిపాదనలతోనే టెండరు ప్రక్రియ ముగించారు. అయితే వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి ప్రాంగణం జలమయం కావడంతో అధికారుల్లో సందిగ్ధానికి కారణమైంది. వాస్తవానికి సీసీబీ నిర్మాణం కోసం 3 ఎకరాల స్థలం అవసరం అవుతుంది. అంత స్థలం జడ్చర్లలో అందుబాటులో లేదు. ఆస్పత్రి పాత భవనం వద్ద నిర్మించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చినప్పటికీ.. అనువైన స్థలం కాదని తేల్చారు. దీంతో అధికారులు ఎటు పాలుపోక నిర్మాణం చేపట్టకుండా ఉన్నారు. ఎట్టకేలకు సీసీబీ పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారు. కాగా, ఏరియా ఆస్పత్రిని నీరు నిల్వ ఉండే ప్రాంతంలో నిర్మించారని ఆరోపణలు చేస్తున్న నాయకులు.. అక్కడే క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఎలా నిర్మిస్తారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

'కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్‌ను అవమానించడం అంటే.. సూర్యుడిపై ఉమ్మివేసినట్లేనని పేర్కొన్నారు. అన్నివర్గాల శ్రేయస్సు కోసం రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అమిత్‌షా అహంకారానికి పరాకాష్ట అని తెలిపారు. రాజ్యాంగం ఆధారంగానే సామాన్య ప్రజలు కూడా రాజకీయ సమానత్వానికి చేరువ కావడం మనువాదులకు ఎంత మాత్రం రుచించడం లేదన్నారు. మనువాదుల కుట్రపూరిత చర్యల్లో భాగంగానే అమిత్‌షా అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు చేశారన్నారు. రాజ్యాంగ ప్రకారం అత్యున్నత పదవిలో ఉన్న అమిత్‌షా ఇప్పటికైనా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జడ్చర్ల టౌన్: బాక్సింగ్ డేను పురస్కరించుకొని గురువారం జడ్చర్ల బేతని ఎంబీ చర్చి యూత్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, క్రికెట్, షార్ట్‌పుట్ పోటీలు, ఎంబీ గార్డెన్‌లో మ్యూజికల్ చైర్, చెస్ క్యారమ్స్ పోటీలు నిర్వహించగా.. పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు రెవ విలియంబూత్, పాస్టర్ స్టీవెన్‌రాజ్, చైర్మన్ ఫిలెమోన్, కార్యదర్శి తిమోతి ప్రార్థనలు చేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ చైర్మన్ సుస్మిత్, వైస్ చైర్మన్ చెర్రిగడ్డం, నతానియల్, సీబ రత్నం, అమృత్‌రాజ్, ప్రీతం, డేవిడ్ డ్యాని, శశిధర్ పాల్గొన్నారు.

టీజీఓ సంఘం బలోపేతానికి కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): టీజీఓ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన విజయ్‌కుమార్‌ను గురువారం ముదిరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, న్యాయవాది ఎన్పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. టీజీఓ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు జనార్దన్, అధ్యక్షుడు విజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి శంకర్, అసోసియేట్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మున్సిపల్ జవాన్‌కు సత్కారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని 7వ వార్డు అయ్యప్ప గుట్టపై ఉన్న ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచినందుకు మున్సిపల్ జవాను సిరాజుద్దీన్‌ను గురువారం అయ్యప్పస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు సీఆర్ భగవంతరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా మహా పడిపూజకు ముందే పారిశుద్ధ్య కార్మికులతో అక్కడ వివిధ పనులు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి సమ్మె

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి రెండు రోజులపాటు సమ్మె చేపట్టనున్నట్లు పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, వెంకటేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న జిల్లా కేంద్రంలో ర్యాలీ ఉంటుందని, 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ ముట్టడికి పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. గురువారం ఏనుగొండలోని సగరకాలనీ, రామకృష్ణకాలనీ, వివేకానందనగర్‌లో పర్యటించారు. కాగా, ఆయా వీధుల్లో మట్టిరోడ్లే శరణ్యమయ్యాయని.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, పురుషోత్తం పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి ఘనస్వాగతం



పాలమూరు/జడ్చర్లటౌన్: నారాయణపేట జిల్లా పర్యటనకు వెళ్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి గురువారం జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఎంపీ డీకే అరుణ నివాసానికి చేరుకున్న మంత్రికి ఎంపీతో పాటు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకున్న మంత్రి.. బీజేపీ నేతలతో కలిసి నారాయణపేట జిల్లాకు బయల్దేరి వెళ్లారు.

ఎమ్మెల్యేకు సన్మానం



దేవరకద్ర: దేవరకద్రను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో స్థానిక మైనార్టీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫారూఖ్, ఇనాయత్, జమీల్, కుతుబు, రహమత్‌అలీ, జహీద్‌అలీ, సైఫ్‌అలీ, ఒమర్ పాల్గొన్నారు.

29న అయ్యప్పస్వామి మహా పడిపూజ

గండేడ్/మహమ్మదాబాద్: మహమ్మదాబాద్ కాంతిమాల శిఖరంపై ఈ నెల 29న అయ్యప్పస్వామి నారికేళ మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురుస్వాములు శ్రీనివాస్, రాజుగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుస్వాములు బొక్క చెన్నయ్య, శ్రీనివాస్, చిన్వేష్, మౌనేష్‌లచే నారికేళ పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న ఉదయం 6 గంటలకు మహమ్మదాబాద్ శివాలయం నుంచి కాంతిమాల శిఖరం అయ్యప్ప ఆలయం వరకు కలశాల ఊరేగింపు ఉంటుందన్నారు. 9 గంటలకు గణపతి, కుమారస్వామి అలంకరణ మహోత్సవం, 10:30 గంటలకు అయ్యప్పస్వామి నారికేళ మహా పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 గంటలకు అష్టాదశ కలశ పూజ, అయ్యప్పకు అభిషేకం, 12:30 గంటలకు నారికేళ గురుస్వామి చెన్నయ్యకు అష్టాదశ కలశాలతో 18 మంది నారికేళ గురుస్వాములచే చక్ర స్నానం చేయించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు ఏకశిల పదునెట్టాంబడిపై దీపారాధన, 2 గంటలకు తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నారికేళ మహా పడిపూజకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు బాదేపల్లిలో..

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలోని ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు రంజిత్‌బాబు గురువారం తెలిపారు. మహా పడిపూజలో భాగంగా అనుప రఘు గృహం నుంచి స్వామివారి ఆభరణాల ఊరేగింపు ప్రారంభమై.. ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం స్వామి మూలవిరాట్‌కు ఆభరణాల అలంకరణ, భిక్ష సంతర్పణ ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు మహా పడిపూజ ఉంటుందని.. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని రంగాల్లో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్సా ఇస్లామియా కాషీఫుల్ ఉలుమ్ సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయానికి ప్రజాప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బడ్జెట్‌లో కేటాయించే ప్రతి పైసా నిజమైన లబ్ధిదారుడికి చేర్చాలన్నదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. నిబద్ధతతో విద్యాభివృద్ధికి పాటుపడుతున్న సంస్థలకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు కంప్యూటర్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, నూరుల్ హాసన్, రఫీక్ పటేల్, సమద్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

హన్వాడ/చిన్నచింతకుంట: ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని దాచక్‌పల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే ఆకాంక్షతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషించిందని వివరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్, చాంద్‌బాషా. సత్యనారాయణరెడ్డి, వెంకటేనాయక్, రాజునాయక్, ప్రతాప్ నాయక్, గోపాల్, లక్ష్మణ్, రామస్వామి, భగవంతు, రాజు తదితరులు పాల్గొన్నారు.



దాచక్‌పల్లిలో సీపీఐ జెండావిష్కరణలో పాల్గొన్న సీపీఐ నాయకులు

- చిన్నచింతకుంట మండలంలోని నెల్లికొండిలో నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవానికి జిల్లా అధ్యక్షురాలు భార్గవి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వందేళ్లుగా బడుగు బలహీన వర్గాల పక్షాన సీపీఐ ఎన్నో పోరాటాలు చేపట్టి అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అమరజ్యోతి, శ్రీనివాసులు, రవి, సామేలు, మాసన్న పాల్గొన్నారు.

విప్లవ వీరుడు ఉద్ధమ్ సింగ్



సర్దార్ ఉద్ధమ్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: భారత విప్లవ వీరుడు సర్దార్ ఉద్ధమ్ సింగ్ అని బహుజన మహనీయుల శోభాయాత్ర ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్ కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో ఉద్ధమ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో భారతజాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచి చరిత్రలో ప్రత్యేక స్థానం పొందారన్నారు. 1919 ఏప్రిల్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ మారణకాండలో ఎందరో భారతజాతి బిడ్డల మరణానికి కారకుడైన బ్రిటిష్ అధికార జనరల్ డయ్యర్‌ను హతమార్చి దేశ ధీరత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వీరయోధుడని కొనియాడారు. బ్రిటిష్ పాలకుల గుండెల్లో భయం పుట్టించి విప్లవ వీరుడిగా కీర్తి గడించారని తెలిపారు. జిల్లా కేంద్రంలో సర్దార్ ఉద్ధమ్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, ఉస్కిళ్ల వెంకట్రాములు, వెంకటస్వామి, సాజిదా సికిందర్, పద్మజ, యాదగిరి, మహేష్, సురేష్, దినేష్, విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ వార్షికోత్సవం



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కంచన్‌పల్లిలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని గాంధీనగర్ ట్రస్టు కాలనీలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి, శివాలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, ఆంజనేయ స్వామి, శివలింగం, సుబ్రహ్మణ్యస్వామి, దక్షణామూర్తి, నవగ్రహాలు, నాగుల విగ్రహాలకు పంచామృతాభిషేకం చేశారు. శివుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ రఘురాం గౌడ్, మాజీ సర్పంచ్ రేణుక, సాయి సేవాసమితి సభ్యులు దత్తుకుమార్, రామకృష్ణ, కాలనీవాసులు రామకృష్ణ, శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లిలో కోట మైసమ్మ, పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి గురువారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రఫీక్, నర్సింహులు, దేవాలయ కమిటీ చైర్మన్ శేఖర్, జంగయ్య, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, భీమయ్య, వినోద్ పాల్గొన్నారు.

చల్లని గాలులతో అవస్థలు

పాలమూరు: నాలుగు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో పలు రుగ్మతలతో బాధపడే వారు చల్లదనంతో నరకం చూస్తున్నారు. కొందరికి ఊపిరి సల్పనివ్వడం లేదు. చల్లని వాతావరణం కారణంగా ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు జనాలు ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నపాటి జల్లులు కురిసిన తర్వాత వాతావరణం మరింత చల్లబడింది. చల్లని గాలులతో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రికి సాధారణ రోజుల కంటే ఈ వారం నుంచి ఓపీతో పాటు అడ్మిట్ రోగులు బాగా పెరిగారు. వచ్చిన వారిలో చాలా మందికి ఫీవర్, జలుబు, దగ్గు మాత్రమే ఉంటున్నాయి. అదే విధంగా ఛాతి, శ్వాసకోశ సమస్యలు ఉన్న వారు సైతం వస్తున్నారు. సాధారణ రోజుల్లో ఛాతి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలతో వచ్చే వారి సంఖ్య కంటే 30 శాతం పెరిగిందని వైద్యులు చెబుతున్నారు.

లంబాడీల మహాగర్జనను విజయవంతం చేయండి

నవాబుపేట: లంబాడీ భాషకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న షాద్‌నగర్‌లో నిర్వహించతలపెట్టిన లంబాడీల మహాగర్జనను విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందర్ నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లంబాడీలకు చెందిన గోర్ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మహాగర్జనకు లంబాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సేవ్యానాయక్, లింబ్యానాయక్, శంకర్‌నాయక్ ఉన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: క్రిస్మస్ పండుగ సందర్భంగా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు బుధ, గురువారం రెండు రోజులపాటు సెలవులు ఇచ్చారు. శుక్రవారం మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగనున్నాయి. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి, మార్కెట్‌లో జరిగే టెండర్ల ద్వారా ధరలు పొందవచ్చని అధికారులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కామారంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ కృష్ణకిషోర్

నవాబుపేట: వేరుశనగ పంటకు ఆశించే తెగుళ్లను రైతులు గుర్తించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కృష్ణకిషోర్ సూచించారు. గురువారం మండలంలోని కామారం, గురుకుంట, మరికల్ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వేరుశనగ పంటకు వచ్చే సట్టతెగులు, లద్దె పురుగు మూలంగా దిగుబడి పూర్తిగా తగ్గుతుందని ఆయన వివరించారు. సట్టతెగులు నివారణకు కార్బండైజిన్, మాంకోజైంబోలను 100 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే లద్దెపురుగు నివారణకు ఇమామెక్సిన్ పిచికారీ చేయాలన్నారు. పంట సంరక్షణకు విధిగా వ్యవసాయధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన తానేం రాజును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులను దూషించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు జిల్లా పార్టీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న తానేం రాజుపై క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాగా, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి అడ్డు తగులుతారన్న అనుమానంతో కాకర్లపహాడ్‌కు చెందిన కొందరు అధికార పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.